ప్రైవేట్‌లో పుస్తక వ్యాపారం

- ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు కాదని ప్రైవేటు పబ్లిషర్స్‌కు ఆర్డర్లు
- రూ.లక్షల్లో ఆర్జిస్తున్న యాజమాన్యాలు

బాలాజీచెరువు: నగరానికి చెందిన శ్రీనివాస్ ప్రైవేట్ కంపెనీలో గుమస్తాగా ఉద్యోగం చేస్తున్నాడు. తన ఇద్దరు పిల్లలను దగ్గరలోని ప్రైవేట్ పాఠశాలలో చేర్పించాడు. ఒకటో తరగతిలో చేర్పించిన బాబుకు రూ.15వేల ఫీజుతో పాటు అదనంగా మరో నాలుగువేలు చెల్లించాలని స్కూల్లో చెప్పారు. రెండో తరగతిలో చేర్పించిన పాపకు ఫీజు రూపంలో రూ.18 వేలతో పాటు మరో ఐదువేలు చెల్లించాలని చెప్పారు. ప్రభుత్వ పుస్తకాల వెల ఒకొక్క విద్యార్థికి రూ.500 నుంచి రూ.700 లోపే కదా అని అడిగితే ప్రభుత్వ పుస్తకాలతో తమకు సంబంధం లేదని, పాఠశాలలో తామిచ్చే పుస్తకాలనే కొనుగోలు చేయాలని పాఠశాల యాజమాన్యం సెలవిచ్చింది. కాకినాడ నగర వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులకు ఇదో ఉదాహరణ మాత్రమే.

ధనార్జనే ధ్యేయం..

జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పబ్లిషర్స్ పుస్తకాలు పాఠశాలల్లో విక్రయిస్తున్నారు. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ రూపొందించిన పాఠ్యాంశాల బోధనకు బదులుగా ఆయా పాఠశాలల యాజమాన్యాలు అనధికార పాఠ్య పుస్తకాలతో తరగతులు నిర్వహిస్తున్నారు. గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా రూపొందించి ముద్రించిన పాఠ్యపుస్తకాలు బోధించాలని ప్రభుత్వ నిబంధనలు స్పష్టం చేస్తున్నప్పటికీ ప్రైవేట్ పాఠశాలల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. 2024–25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల్లో విక్రయించడానికి సిద్ధం చేసినప్పటికీ వాటిని కొనుగోలు చేయకుండా ప్రైవేట్ పబ్లిషర్స్ నుంచి అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. కాకినాడ నగరంతో పాటు రూరల్ మండలంలోని 90 వరకూ ప్రైవేట్ పాఠశాలలు ఉండగా వీటిలో 30 వేల మంది వరకూ విద్యార్థులు ఉన్నారు.



డీమార్ట్ వద్ద గల కేకేఆర్ గౌతమ్ పాఠశాలలో విక్రయానికి ఉంచిన పుస్తకాలు



జిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ

హెచ్‌ఎం లాగిన్ ద్వారా విక్రయాలు..

ప్రైవేట్ పాఠశాలలకు అవసరమైన పుస్తకాలు హెచ్‌ఎం లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి కొనుగోలు చేసే విధంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వం అన్ని పాఠశాలలకు సమాచారం ఇచ్చింది. నగర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో కనీసం 20 శాతం కూడా ఆన్‌లైన్ పుస్తకాలకు ఇండెంట్ పెట్టని పరిస్థితి ఉంది.

> **ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు కొనుగోలు చేయాల్సిందే..**
>
> 
>
> ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్యపుస్తకాలు కచ్చితంగా కొనుగోలు చేయవలసిందే. తరగతుల వారీగా ప్రభుత్వం నిర్ణయించిన ధరల్లో ఐదుశాతం ఆన్‌లైన్‌లో చెల్లించి మిగిలిన మొత్తాన్ని సంబంధిత విక్రయదారులకు చెల్లించి పుస్తకాలు పొందాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠ్య పుస్తకాలకు వందశాతం ఇండెంట్ పెట్టాలి.
>
> –పిల్లి రమేష్, డీఈఓ, కాకినాడ

ముంపులో ఉప్పలంక కాలనీ



ఉప్పలంక కాలనీలో వర్షపు నీటిలో నానుతున్న ఇళ్లు

కరప: గత వారంలో కురిసిన భారీవర్షాలకు మండలంలోని ఉప్పలంక కాలనీ ముంపునకు గురైంది. మూడు రోజులుగా ఎండలు కాస్తున్నా, ముంపు నీటితో దోమలు వ్యాప్తిచెంది, అంటువ్యాధులు వ్యాప్తిచెందే అవకాశముందని కాలనీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విషసర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయని, వర్షంనీరు పోక, నేటికీ మోకాలులోతు నీటిలో రాకపోకలుసాగిస్తున్నామని వారు వాపోయారు. నీటి నిల్వ వల్ల ఇంటిగోడలు నానిపోయి దెబ్బతింటున్నాయని, ముంపునీటిలోంచి పిల్లలను పాఠశాలలకు పంపాలంటే ఏ ముప్పు ముంచుకొస్తుందోనని భయపడుతున్నామని మహిళలు తెలిపారు. జిల్లాలోని పలుగ్రామాల్లో డయేరియా కేసులు నమోదవుతున్నాయని, అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ మండల అధికారులు గ్రామకార్యదర్శులను అప్రమత్తం చేస్తూనే, ఉప్పలంక కాలనీ నాలుగురోజులుగా ముంపునీరు లాగక నానా అవస్థలు పడుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఉప్పలంకలో తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఎమర్జెన్సీ చీకటి రోజులపై నిరసన

నాటి ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నేతలకు సన్మానం

కాకినాడ రూరల్: దేశంలో 1975–77 కాలంలో 21 నెలల పాటు అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడి జైలుకు వెళ్లిన బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు నండూరి కృష్ణ, కృష్ణ గోపాల్ లునానిలను బీజేపీ నాయకులు మంగళవారం సన్మానించారు. బీజేపీ నాయకులు అనపర్తి వెంకటేష్, కొండేటి గంగాధర్, ఎం.వెంకట్రావుల ఆధ్వర్యంలో బోట్‌క్లబ్ సమీపంలోని ప్రకృతి ఆశ్రమం వద్ద జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, కాకినాడ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ చరిత్రలో అతి పెద్ద చీకటి రోజులుగా ఎమర్జెన్సీ మిగిలిపోయేలా కాంగ్రెస్ పాలన చేసిందన్నారు. జూన్ 25న ఎమర్జెన్సీ చీకటి రోజుగా జరుపుకొంటున్నామన్నారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనరు పితాని లీలావతి, సిటీ కన్వీనరు గట్టి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



నండూరి కృష్ణ, కృష్ణ గోపాల్ లునానిలను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

అర్హులకు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

- తహసీల్దార్ రామకోటేశ్వరరావు
- వీఆర్వోలు, వీఏఏలు, ఏఈఓలతో సమీక్ష

కరప: ప్రభుత్వం అమలుచేసే పథకాలు పొందాలన్నా, బ్యాంకుల ద్వారా పంటరుణాలు తీసుకోవాలన్నా, పండించిన పంటకు మద్దతుధర లభించాలన్నా, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు బీమా వర్తింపచేయాలన్నా కౌలు రైతులందరూ తప్పనిసరిగా గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ) తీసుకోవాలని తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం వీఆర్వోలు, వీఏఏలు, ఏఈఓలతో ఏర్పాటుచేసిన సమావేశంలో కౌలుగుర్తింపు కార్డులు మంజూరుపై సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. గ్రామాల్లో దండోరా వేయించి, రైతులు, కౌలురైతులతో సమావేశాలు ఏర్పాటుచేసి గుర్తింపు కార్డులపై అవగాహన కల్పించాలన్నారు. గుర్తింపు కార్డులు 11 నెలల కాలపరిమితికి ఇస్తామని, దాని వల్ల భూమి యజమానుల హక్కులకు ఎటువంటి భంగం వాటిల్లదని తెలియజేసి, కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రామకోటేశ్వరరావు సూచించారు. ఎంపీడీఓ ఏవీ రాజేష్ మాట్లాడుతూ మండల పరిధిలో 4,900 మంది కౌలురైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలన్న లక్ష్యాన్ని వీఏఏలు వీఆర్వోలతో కలసి పూర్తిచేయాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అర్హులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సూచించారు. ఆర్బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, పంటకాలువల్లో సమృద్ధిగా సాగునీరు వస్తోందని, రైతులు సార్వా సాగుకు సమాయత్తం కావాలని ఎంఏఓ రాజేష్ కోరారు. ఆర్‌ఐ పేపకాయల మాచర్రావు తదితరులు పాల్గొన్నారు.



కరపలో కౌలు గుర్తింపు కార్డుల మంజూరుపై సమీక్షిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

వేంకటేశ్వరస్వామికి జన్మనక్షత్ర పూజలు



స్వామివారికి జన్మ నక్షత్ర పూజలు, వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

కరప: మండలం యండమూరులోని సామ్రాజ్య లక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వేంకటేశ్వరస్వామివారి జన్మనక్షత్రం శ్రవణం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామం, వేదపండితులతో కలసి పూజాదికాలు చేశారు. ఈసందర్భంగా భక్తులతో వెంకటేశ్వరస్వామి వ్రతాలు నిర్వహించారు. యండమూరు, పరిసర గ్రామాల నుంచి భక్తులు వచ్చి, వ్రతాలు చేయించుకుని, స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కరప విష్ణాలయంలోని వెంకటేశ్వరస్వామికి అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు, కూరాడ, పెనుగుదురు, గురజనాపల్లి, వేళంగి తదితర గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి జన్మనక్షత్ర పూజలు నిర్వహించారు.

వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు



ఆలయంలో పూజలు చేస్తున్న ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు

కాకినాడ: కాకినాడ సాంబమూర్తినగర్‌లోని వైభవ వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కాకినాడ పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామికి అభిషేకాలు చేశారు. వందలాది మంది భక్తులతో పాటు కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో త్రిపురసుందరి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జొన్నాడ చినబాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చిన్నారులను బడిలో చేర్పించాలి



నడకుదురులో పిల్లలను, తల్లిదండ్రులను చైతన్యపరుస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

కరప: ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా గ్రామాల్లో పర్యటించి బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులను చైతన్య పరచాలని ఎంఈఓలు కె.బుల్లి కృష్ణవేణి, పి.సత్యనారాయణ కోరారు. మండలం నడకుదురులో మంగళవారం తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులతో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ×నేను బడికి పోతా× కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలన్నారు. విద్యా ప్రగతికి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ తదితర విషయాలను ఎంఈఓలు వివరించారు. అనంతరం గ్రామంలో నేను బడికి పోతా అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం వాకాడ వెంకటరమణ, సీనియర్ టీచర్ కె.విజయలక్ష్మి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేసి జిల్లాకు పేరు తేవాలి

కలెక్టర్ షాన్ మోహన్

కాకినాడ సిటీ: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన షాన్ మోహన్ సగిలి మంగళవారం కలెక్టరేట్ వివేకానందహాలులో వివిధ విభాగాల అధిపతులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అడ్మినిస్ట్రేషన్, ల్యాండ్, కోఆర్డినేషన్, మెజిస్టీరియల్, లీగల్ సెల్, ఎన్నికల విభాగం తదితర సెక్షన్ సూపరింటిండెంట్లతో సమావేశమై వారు నిర్వహిస్తున్న విధులు, ఖాళీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధిపతులు అంతా బృందంగా, సమిష్టిగా, జిల్లా స్థాయి అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ఎటువంటి వివాదాలకు చోటు ఇవ్వకుండా పని చేసి, జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. సమావేశంలో కలెక్టరేట్ ఏవో బి.సాయి సత్యనారాయణ, సెక్షన్ సూపరింటిండెంట్లు పి త్రినాథరావు, డీఆర్‌కె రాజు, సీహెచ్ సంధ్యారాణి, ఎన్నికల డీటీ ఎం జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



వివిధ విభాగాల అధిపతులతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్

వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

మంత్రి లోకేష్‌కు రాష్ట్ర పీఈటీ సంఘ అధ్యక్షుడు జార్జి వినతి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను విజయవాడలో రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు లంక జార్జి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలపై ఆయనకు వినతి పత్రం అందజేశారు. జార్జి మాట్లాడుతూ రాబోయే డీఎస్సీలో ప్రతి యూపీ స్కూల్‌కి ఒక పీఈటీ పోస్టు కేటాయించాలని, జూనియర్ కళాశాల పోస్టుల భర్తీలో భాగంగా పీడీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 292 హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో పీడీ పోస్టులు భర్తీ చేయాలని వినతి పత్రం అందేశారు.

జాబ్ మేళాలో 12 మందికి ఉద్యోగ అవకాశాలు



ఎంపికైన విద్యార్థులతో సంస్థల ప్రతినిధులు

పిఠాపురం: పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కాకినాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ మేళాలో 38 సంస్థలు పాల్గొన్నాయి. మౌఖిక పరీక్షలలో 12 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. విద్యార్థులకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.సుభాషిణి, వైస్ ప్రిన్సిపాల్ ఉషశ్రీ నియామక పత్రాలను అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కాకినాడ సిటీ: కాకినాడ జగన్నాథపురం సెక్టార్–1 పరిధిలోని గోగుదానయ్యపేట అంగన్‌వాడీ కేంద్రంలో విద్యను అభ్యసించిన 58 మంది 5 ప్లస్ పిల్లలకు మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అనంతరం ఈ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అర్బన్ ఎంఈవో సీహెచ్ రవి, ప్రాజెక్టు సీడీపీవో ఎ.జ్యోతి, గోగుదానయ్యపేట పాఠశాల హెచ్‌ఎం సూర్యచక్రం, ఏటిమొగ, నేతాజీ పార్కు హెచ్‌ఎంలు సుబ్బారెడ్డి, బి.శ్రీనివాస్ పాల్గొని గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులకు ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు అందించి సిల్వర్ మెడల్‌తో సత్కరించారు. ఆడపిల్లలను రక్షించండి, ఆడపిల్లను చదివించండి అంటూ కళాజాతలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ ప్రభావతి, సెక్టార్ లీడర్లు కె.సరోజనీదేవి, వై.శ్రీవల్లి, ఎం.నూకరత్నం, కె.సుజాత, ఆర్.పార్వతి, పి.సుజాత, ఎ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

గ్రంథాలయానికి ఫ్యాన్ల బహూకరణ

పెద్దాపురం: స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయానికి దాతలు ఫ్యాన్లు అందజేసినట్లు గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు తెలిపారు. పట్టణ మహారాణి సత్రం మాజీ చైర్మన్ తూతిక రాజు మంగళవారం పాఠకుల సౌకర్యార్థం రెండు ఫ్యాన్లు బహూకరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. పాఠకుల సౌకర్యార్థం ఫ్యాన్లు అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుల్లియ్య, నాని, రామారావు, కొమ్మన అప్పారావు, అరవింద్, నరేంద్రకుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ, డీఎఫ్‌వోలు



కలెక్టర్ షాన్ మోహన్‌తో మాట్లాడుతున్న ఎస్పీ, డీఎఫ్‌వో

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన షాన్ మోహన్ సగిలిను మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాలోని పరిస్థితులను ఆయనకు ఎస్పీ సతీష్‌కుమార్, డీఎఫ్‌వో భరణి వివరించారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



హోమం నిర్వహిస్తున్న పండితులు

బోట్‌క్లబ్: వేదవిజ్ఞాన ప్రతిష్ఠానం ఆధ్వర్యంలో జేష్ఠపౌర్ణమి సందర్భంగా స్థానిక రామారావుపేట వేదవిజ్ఞాన ప్రతిష్ఠానం కార్యాలయంలో మంగళవారం చండీహోమం నిర్వహించారు. ప్రముఖ జ్యోతిష్య పండితులు పుసులూరి సర్వేశ్వర ఫణిశర్మ ఆధ్వర్యంలో ఈ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చండీ హోమం నిర్వహించడం వల్ల ప్రజలు సుఖశాంతులతో జీవిస్తారన్నారు. జ్యోతిష్యరంగంలో అనేక మంది ప్రముఖులు హోమాలను ఎప్పటికప్పుడు నిర్వహించడంలో వేద విభాగ కమిటీ అధ్యక్షులు పండిత రాయప్రోలు ప్రసాదశర్మ సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు.

వృద్ధులకు పాద రక్షల పంపిణీ



వృద్ధులకు పాదరక్షలు పంపిణీ చేస్తున్న డాక్టర్ వరలక్ష్మి

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామంలోని రాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద వృద్ధులకు పాదరక్షలను ప్రాణిక్ హీలింగ్ వైద్యురాలు ఎం.వరలక్ష్మి మంగళవారం పాదరక్షలు ఉచితంగా పంపిణీ చేశారు. గతించిన జీవితం గురించి చింతించక వర్తమానంలో సంతోషంగా గడిపేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్, అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షురాలిగా పద్మావతి

కరప: బీజేపీ మండల అధ్యక్షురాలిగా గొర్రిపూడి గ్రామానికి చెందిన యర్రంనీడి పద్మావతి నియమితులయ్యారు. ఈమేరకు కాకినాడ పార్లమెంటరీ జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరు రామ్‌కుమార్ నుంచి మంగళవారం ఉత్తర్వులు అందినట్లు పద్మావతి స్థానిక విలేకరులకు తెలిపారు. ఆమెను పలువురు పార్టీ నాయకులు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప: గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు. మండలం పెద్దాపురప్పాడు గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తి వాంతులు చేసుకుని రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉండగా, గ్రామస్తులు గుర్తించి సోమవారం చికిత్స కోసం 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించిన విషయం పాఠకులకు తెలిసిందే. సదరు వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృత దేహాన్ని కాకినాడ ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచారని, ఆ వ్యక్తి వివరాలు తెలిస్తే కరప పోలీసుస్టేషన్‌కు తెలియజేయాలని ఎస్‌ఐ రామకృష్ణ కోరారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి ఉత్సవం



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

బోట్‌క్లబ్: కలియుగంలో ఆధ్యాత్మికతకు ఆటంకాలు తొలగించే సంకష్టహరచతుర్థి మాసోత్సవం కష్టాలు తొలగించే వేంకటేశ్వర స్వామి నామశక్తి పాతాన్నిందించే సర్వ దేవతా వ్రతాల మణిహారమని భోగిగణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. స్థానిక భోగి గణపతి పీఠంలో మంగళవారం ఐదో చతుర్థి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సుప్రభాతవేళలో సన్నాయి మేళంతో నగర సంకీర్తన చేశారు. ఆలయంలో రాత్రి లక్షవత్తుల దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.